సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 31 । జనవరి । 2023



చదువుకు పట్టం

విద్యా రంగ పథకాల అమలు బాధ్యత ఏపీఎంలకు అప్పగించారు. మండలానికో పర్యవేక్షకుడు ఉంటారు. - 8లో



చిరుధాన్యాల కొనుగోలు

చిరుధాన్యాల కొనుగోలు పూర్తిస్థాయిలో జరుగుతుంది. వ్యవసాయ శాఖ జేడీ ఈ మేరకు తెలిపారు. - 8లో

అకౌంట్స్, టాలీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణల్లో భాగంగా 1వ తేదీ నుంచి కంప్యూటర్ అకౌంట్స్, టాలీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యార్హత కాగా, 30 రోజులు శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9553410809, 7993340407కు సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఆన్‌లైన్ పద్ధతిలో కొనసాగుతున్నాయి. రెండు కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో సజావుగా సోమవారం పరీక్షలు జరిగాయి. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 173 మందికి 172 మంది హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 128 మందికి 126 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరు కాగా ఒక్కరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరు కాగా, ఒక్కరు గైర్హాజరయ్యారు.

నేటి నుంచి వెంకన్న తిరుక్కల్యాణోత్సవాలు



పూజలందుకుంటున్న లోళ్లపుట్టుగ కల్యాణ వేంకటేశ్వరస్వామి

కవిటి: మండలంలోని లోళ్లపుట్టుగలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి 42వ తిరుకల్యాణోత్సవాలు, 53 వ సుప్రభాత వార్షికోత్సవం మంగళవారం నుంచి గురువారం వరకు జరగనున్నాయి. 31న సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, దీక్షాధారణ తదితర విశేష పూజలు నిర్వహిస్తారు. తొలిరోజు నుంచి చివరి రోజు వరకు ప్రతిరోజూ సాయంత్రం 3 గంటలకు ఎంవీ సింహాచలశాస్త్రి భాగవతార్ హరికథాగానం ఉంటుంది. శనివారం సత్యనారాయణ స్వామి వ్రతం, అన్న ప్రసాద వితరణ, చివరి రోజు పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి.

నవోదయ దరఖాస్తు గడువు పెంపు



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను 6 వ తరగతిలో ప్రవేశ దరఖాస్తులు గడువు ఫిబ్రవరి 8 వరకు పొడిగించినట్లు విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీవీ రమణ సోమవారం తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా నవోదయ వెబ్‌సైట్‌లో మాత్రమే పంపాలని తెలిపారు. విద్యార్థులు ఈసదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

స్పందనకు 220 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఫేస్ రికగ్నైజేషన్ ఎన్ రోల్ చేయాల్సి ఉందని, ఎన్ రోల్ చేసేందుకు జెడ్పీ సీఈఓ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మొత్తం 220 అర్జీలను స్వీకరించారు. అర్జీల స్వీకరణలో ఉప కలెక్టర్ జి.జయదేవి, జెడ్పీ సీఈఓ వెంకటరామన్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, పాల్గొన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పందనలో సంతాపంగా అధికారులంతా మౌనం పాటించారు.

ఎస్పీ స్పందనకు 34 ఫిర్యాదులు

శ్రీకాకుళం క్రైమ్: స్పందనకు వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 34 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ వెల్లడించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులు స్వీకరించిన వారిలో ఎస్పీతో పాటు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్ ఉన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

● ఉత్సవ రంగం

ఉత్సాహ తరంగం

జిల్లాలో జాతరల జోష్

కాళీయ మర్దన వేణుగోపాలుని రాక కోసం వంశధార ఎదురు చూస్తోంది. మూడు నామాల వాడి వేయి నామాల స్మరణ వినేందుకు సుమంచ పాండవుల మెట్ట నిరీక్షిస్తోంది. మొక్కులు తీర్చే భక్తుల రాకకోసం రాములమ్మ పేరంటాళ్ల కోవెల ముస్తాబయ్యింది. ఒకటా రెండా.. ఊరూరా.. వాడవాడనా వైష్ణవ క్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి. భీష్మ ఏకాదశి నాడు వైకుంఠ ధాముని కొలిచి మొక్కేందుకు కోవెలలు సర్వసన్నద్ధమయ్యాయి.



● నమ్మకాల పుట్ట.. ఈ గుట్ట..

గార: శ్వేతగిరిపై వేంచేసిన కాళీయ మర్దన వేణుగోపాలస్వామి యాత్రకు శాలిహుండం ముస్తాబైంది. బుధవారం మాఘశుద్ధ ఏకాదశి(భీష్మ ఏకాదశి)ని పురస్కరించుకొని ఏటా నిర్వహించే ఈ యాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నెల 31న అర్ధరాత్రి స్వామికి క్షీరాభిషేక సేవ అనంతరం ఫిబ్రవరి 1వ తేదీన వంశధార నదిలో స్వామి ఉత్సవ మూర్తులకు చక్రతీర్థ స్నానముంటుంది. 5వతేదీ మాఘ పౌర్ణమి రోజున కొండమీద తిరుక్కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈ ఆలయాన్ని క్రీస్తు శకం నాలుగో శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.



సిద్ధమవుతున్న బారికేడ్లు

వరదపాశం..



కొండపైన కాళీయ మర్ధన వేణుగోపాల స్వామి ఆలయ సమీపంలో వరదపాశం ఉంది. జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఈ రాయి వద్ద పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి జలాభిషేకం చేస్తే వర్షాలు కురుస్తాయని భక్తుల నమ్మకం.

రాళ్లు పేరిస్తే..



ఆలయ పరిసరాల్లో మీరు నిశితంగా గమనిస్తే ఒకదానిపై మరొకటి పేర్చిన రాళ్లు విశేషంగా ఆకర్షిస్తాయి. ఇలా మూడు రాళ్లను పేర్చి స్వామిని కొలిస్తే కల్యాణ యోగం, సంతాన యోగం, గృహయోగం మూడు కలుగుతాయని భక్తుల నమ్మకం

సొరంగం..



కొండపైకి వెళ్లే మార్గంలో శివాలయం మలుపు వద్ద కొంచెం కిందకు దిగితే పెద్ద రంధ్రం కనిపిస్తుంది. ఇదే సొరంగం. పైకి మట్టితో నిండి ఉన్నా..లోపల సొరంగ మార్గం ఉంది. కొంచెం దూరం వెళ్లిన తరువాత నీటితో నిండి ఉంటుందని స్థానికులు చెబుతున్నా రు. ఉత్సవాల సమయంలో ఈ నీటినే వినియోగిస్తారు. మరో విశేషం ఏమిటంటే ఈ సొరంగ మా ర్గంలో కొబ్బరికాయలను వేస్తే నేరుగా శ్రీకూర్మంలోని ఆలయానికి చేరుతాయని చెబుతారు.

మట్టి కుండల మర్మం..



భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామిని దర్శించే భక్తులు వడపప్పు పానకం తీసుకొచ్చి నైవేద్యంగా సమర్పిస్తారు. చిన్న కుండల్లో వీటిని తీసుకురా వడం..సమర్పణ అనంతరం అక్కడే వదిలేయడం అవి అలా మట్టిలో కలిసిపోవడం పర్యావరణ హితమైన ప్రక్రియని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

కోరిక తీరితే గెలకట్టాల్సిందే..



స్వామి సన్నిధికి వచ్చిన భక్తులు తమ కోర్కెలు తీరితే గర్భాలయానికి ఎదురుగా అరటిగెలలను కట్టి మొక్కు తీర్చుకోవడం ఇక్కడ సంప్రదాయం . అందుకే ఆలయ ప్రాంగణంలో వేలాడదీసిన అరటి గెలలు కనిపిస్తాయి.

జాతరకు వచ్చే భక్తులు సంఖ్య 80,000 మంది

ఎలా వెళ్లాలి..

- శ్రీకాకుళం నగరం నుంచి శ్వేతగిరి 19 కిలోమీటర్లు.
- శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి భైరి రోడ్డు మీదుగా గార వైపు వెళ్లే రోడ్డు గుండా శాలిహుండం చేరుకోవచ్చు.
- పాతబస్టాండ్ నుంచి ఒప్పంగి.. సతివాడ మీదుగా కూడా వెళ్లవచ్చు.
- ఆటోలు, బస్సులు సదుపాయం ఉంది.
- కొండపైకి వాహనాలను అనుమతించడం లేదని సీఐ ఎల్. సన్యాసినాయుడు తెలిపారు.
- శ్రీకాకుళం నుంచి వచ్చే బస్సులు, వాహనాలను పూసర్లపాడు వద్ద, గార మీదుగా వాహనాలు బోరవానిపేట వరకూ అనుమతిస్తామన్నారు.
- మెట్ల మార్గం ద్వారా కొండకు వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకున్న తర్వాత ఘాట్ రోడ్ గుండా కిందికి దిగాలని పోలీసులు సూచించారు.
- ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తెలిపారు.

● పాండవుల మెట్టపై..



టెక్కలి మండలం భగవాన్‌పురం సమీపంలో సుమంచపాండవుల మెట్ట

టెక్కలి: టెక్కలిలోని పాండవుల మెట్టపై బుధవారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేశారు. భగవాన్‌పురం గ్రామం సమీపంలోని పంచ పాండవుల మెట్టకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఏటా భీష్మా ఏకాదశి రోజున జరిగే ఉత్సవానికి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారంతా ఇక్కడకు వచ్చి పూజలు చేస్తారు. త్రేతాయుగంలో రాముడు తన సైన్యంతో ఇక్కడకు వచ్చారని, ద్వాపరంలో పాండవులు ఇక్కడ విడిది చేశారని స్థానికులు నమ్ముతారు. ఈ మెట్టపై ఇప్పటికీ భీముడు, నకుల సహదేవులు, కుంతీ, ధర్మరాజు, అర్జునుడు అప్పట్లో విడిది చేసిన గుహలు కనిపిస్తాయి. వీటితో పాటు అద్భుతమైన వన మూలికలు కలిగిన మెట్టగా పరిగణిస్తారు. 1950లో నేపాల్ రాజ వంశానికి చెందిన బాలకృష్ణానందా గిరిబాబా మహారాజ్ తన దేశ పర్యటనలో భాగంగా ఈ పాండవుల మెట్టకు చేరుకుని ఇక్కడే స్థిరపడ్డారు. ఆ తర్వాత ఎంతో మందికి వన మూలికలతో వైద్య సేవలు అందజేస్తూ ఇదే మెట్టపై జీవ సమాధిగా మారినట్లు శిష్యుడు నిరంజనానంద గిరిబాబా తెలియజేశారు.

అయ్యవారికి అరటి గెలలు

టెక్కలి: సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రలో భీష్మ ఏకాదశి నాడు జరిగే అరటి గెలల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ గ్రామంలో ప్రతీ ఇంట్లో నిర్వహించే శుభకార్యానికి మునుపు పరవస్తు అయ్యవారికి మొదట పూజలు నిర్వహించి ఆ తర్వాత శుభకార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబంలో సమస్యలు లేకుండా కోరిన కోర్కెలు తీరాలని ముందుగా పరావస్తు అయ్యవారు శ్రీ లక్ష్మీ నృసింహాస్వామిని నమ్మకంగా తలచుకుంటే ఆ కోరికలు తీరుతాయనే నమ్మకం భక్తుల్లో బలంగా ఉంది. బుధవారం నుంచి రెండు రోజుల పాటు పరవస్తు అయ్యవారి సన్నిధిలో భీష్మా ఏకాదశి ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.



చెట్లతాండ్ర గ్రామంలో పరవస్తు అయ్యవారు శ్రీ లక్ష్మీ నృసింహాస్వామి ఆలయ సింహద్వారం

● యాభై ఏళ్ల సంప్రదాయం

నరసన్నపేట: భీష్మ ఏకాదశి సందర్భంగా గోపాలపెంటలోని రాములమ్మ పేరంటాల మండపం ఉత్సవానికి సిద్ధమవుతోంది. యాభై ఏళ్లుగా ఇక్కడ ఈ పండగ నిర్వహిస్తున్నారు. అరటి గెలలు, కొత్త చీరలను పేరంటాళ్లకు భక్తులు సమర్పిస్తారు. నరసన్నపేట ప్రాంతం నుంచే కాకుండా విజయనగరం, పర్లాకిమిడి, బరంపురంతో పాటు పాతపట్నం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. వంశధార నదికి ఒక వైపు గోపాలపెంట ఉండగా మరో వైపు శాలిహుండం ఉంది. గోపాలపెంట మీదుగా వందలాది మంది భక్తులు శాలిహుండం కొండపై ఉన్న వేణుగోపాల స్వామిని దర్శించుకునేందుకు వెళ్లే ముందు గోపాలపెంటలోని రాములమ్మ పేరంటాల వద్ద మొక్కులు తీర్చుకుంటారు.



రాములమ్మ పేరంటాల మండపం వద్ద మొక్కులు తీర్చుకొనేందుకు భక్తులు కట్టిన అరటి గెలలు, చీరలు (ఫైల్)

● నేటి నుంచి నిద్దాలమ్మ జాతర



నిద్దాలమ్మ తల్లి

జి.సిగడాం : మండలంలోని నిద్దాం గ్రామంలో వెలిసిన నిద్దాలమ్మ తల్లి యాత్ర మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు మహిళలంతా ముర్రాటలతో తిరువీధి ఉత్సవం నిర్వహించి గ్రామంలోని అసిరితల్లికి చల్లదనం చేస్తారు. మూడో రోజుకూడా మహిళలు ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలతో ఊరేగింపు నిర్వహిస్తారు.

- బుధవారం రాత్రి 1,56,000 దీపాలతో అమ్మవారిని ఆరాధించడం.. ఈ దీపోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావడం ప్రత్యేకత.

ఇలా వెళ్లాలి..

- చిలకపాలెం నుంచి రాజాం మార్గంలో 20 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- రవాణా సదుపాయం ఉంది.

నేటి నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ

- శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా పోటీలు
- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న స్పీకర్ తమ్మినేని

శ్రీకాకుళం న్యూకాలనీ: సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీకి సర్వం సిద్ధమైంది. ఈ పోటీలు మంగళవారం నుంచి మొదలుకానున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరుగనున్న ఈ పోటీలకు 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాల్లో పోరు..

ఈ ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీలో జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చదువుతున్న విద్యార్థులు జూనియర్స్ విభాగంలోను, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, మెడికల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు సీనియర్స్ విభాగంలో ఆయా కళాశాలల జట్లకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు.





క్రికెట్ సాధనలో క్రీడాకారులు

ముఖ్య అతిథిగా స్పీకర్ హాజరు..

మంగళవారం జరిగే ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే క్రీడాధికారులు, ఒలింపిక్, క్రికెట్ సంఘం, పీఈటీ సంఘ నాయకులు హాజరవుతున్నారు.

రాష్ట్రానికి పట్టిన శని చంద్రబాబు

- లోకేష్ యాత్రతో ఒరిగేదేమీ లేదు
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ ఒక్కటే
- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పట్టిన పెద్ద శనిగ్రహం చంద్రబాబునాయుడని, ఈ గ్రహానికి వత్తాసు పలుకుతున్న పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియాను నమ్మే స్థితిలో ప్రజలు లేరని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం తొగరాం గ్రామంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్ చేస్తున్న యువగళం యాత్ర వల్ల ఒరిగేదేమీ లేదని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈ యాత్ర అని విమర్శించారు. లోకేష్ యాత్ర ఆరోగ్యం కోసమే తప్ప ప్రజల కోసం కాదని, అందుకే ఈ పాదయాత్ర మధ్యలోనే నిలుపుదల చేసుకుంటారని తెలిపారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని గతంలో అధికారంలోకి వచ్చి నిరుద్యోగులకు మోసం చేసిన ఘనత చంద్రబాబు నాయుడికి దక్కుతుందన్నారు. మేనిఫెస్టోని అమలు చేయలేక వెబ్‌సైట్ నుంచి తొలగించి ప్రజలను నిలువునా మోసం చేశారని అన్నారు. బహిరంగ సభల పేరుతో కందుకూరు, గుంటూరు ఘటనల్లో అమాయకులను చంద్రబాబు పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు రాజకీయం కోసమే నందమూరి కుటుంబాన్ని వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. తండ్రీకొడుకులు ఎన్ని కుయుక్తులు పన్నినా 2024లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియా అందరూ ఒకవైపుగా వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింహంలా సింగిల్‌గా వస్తాడని తెలిపారు. కుట్రలు చేసే నైతిక అలవాట్లు ఉన్న టీడీపీ తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలు, పార్టీలకు అతీతంగా సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు.

పేదోడికి చేదోడు



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

- జగనన్న చేదోడు మూడో విడత నగదు విడుదల
- జిల్లాలో 14, 460 మందికి లబ్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న చేదోడు మూడో విడత నగదు విడుదల కార్యక్రమం సోమవారం జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించగా.. జిల్లా కేంద్రంలో జరిగిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడారు. జిల్లాలో జిల్లాలో 6,280 మంది రజకులు, 3042 మంది నాయీ బ్రాహ్మణులు, 5138 మంది దర్జీలు కలిపి మొత్తం 14,460 మంది లబ్ధిదారులకు రూ.14.46 కోట్లు జమవుతుందని తెలిపారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 2070 మంది, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 2261 మంది, ఇచ్ఛాపురంలో 1515 మంది, నరసన్నపేటలో 2097 మంది, పలాసలో 1182 మంది, పాతపట్నంలో 1623 మంది, శ్రీకాకుళంలో 2292 మంది, టెక్కలిలో 1634 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఆయన చెప్పారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ మూడో విడత జగనన్న చేదోడు అందుకుంటున్న రజక, నాయీ బ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. పాదయాత్రలో ఈ వర్గాల సమస్యలు గమనించిన వైఎస్ జగన్ చేదోడు పథకానికి రూపకల్పన చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణ లబ్ధిదారులు గులిమి సింహాచలం, దర్జీ లబ్ధిదారులు జి.పాపారావు, ఎస్. శ్రీదేవి, రజక లబ్ధిదారులు కె.గౌరీ మాట్లాడుతూ చేదోడు కింద వచ్చిన రూ.10వేలు తమ వ్యాపారాభివృద్ధికి వినియోగించుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరి అభ్యున్నతి ఆకాంక్షించే ఇలాంటి సీఎం ఎల్లకాలం ఉండాలని కోరారు. ఈ సందర్భంగా నమూనా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల ఛైర్‌పర్సన్లు అందవరపు సూరిబాబు, బల్లాడ హేమామాలిని రెడ్డి, రాజాపు హైమావతి, చీపురు రాణి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.గడ్డెమ్మ, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి వాసుదేవరావు, రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మేలు మర్చిపోలేం



కుట్టు పనికి ప్రస్తుత కాలంలో గుర్తింపు తగ్గింది. ఇలాంటి సమయంలో సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మేలు మర్చిపోలేం. పెట్టుబడి కోసం ఎవ్వరిని ఆశ్రయించకుండా ప్రభుత్వమే సాయం చేయడం హర్షణీయం. – జి.పాపారావు, దర్జీ

రజకులకు గుర్తింపు



రజకులను గతంలో ఏ ప్రభుత్వం గుర్తించలేదు. మాకు జగనన్న చేదోడు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇప్పటికే రెండు పర్యాయాలు ఈ పథకం ద్వారా నగదు అందింది. ఇప్పుడు మూడోసారి అందుతోంది. – కె.గౌరి, రజక మహిళ

● ఆకలైన వేళ ఆశ్రయం





ఉద్దానంలో ఓ వైపు ఎలుగులు ఊళ్లపై దాడులు చేస్తూ భయపెడుతున్నాయి. ఇది ఒక కోణమైతే ఓ ఎలుగు పిల్లను స్థానికులు చేరదీసి పాలుపోసి లాలించడం మరో కోణం. తల్లి నుంచి విడిపోయిన ఎలుగు పిల్లలు బహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామానికి వచ్చేశాయి. దీంతో ఆ పిల్లలను స్థానికులు చేరదీశారు. అవి ఆకలితో ఉండడంతో నీరు, పాలు పట్టారు. అనంతరం తోటల్లోకి తీసుకెళ్లి వాటిని విడిచిపెట్టారు. – మందస

క్లుప్తంగా

ఆదిత్యుడి సన్నిధిలో శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ వీసీ



రామకృష్ణారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని అనంతపురం జిల్లా శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎం.రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. స్వామి ఆశీర్వచనాన్ని అందజేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను శంకరశర్మ ఆయనకు వివరించారు.

3న గార వైస్ ఎంపీపీ ఎన్నిక

అరసవల్లి: గార మండల పరిషత్ ఉపాధ్యక్ష స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి మూడో తేదీ ఉదయం 11 గంటలకు గార మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీతో పాటు మిగిలిన సభ్యులందరితో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, ఉపాధ్యక్ష స్థానాన్ని ఎంపిక చేసుకునేలా షెడ్యూల్ ప్రకటించారు. ఇదిలావుంటే గార వైస్ ఎంపీపీగా పనిచేసిన బరాటం రామశేషు ఇటీవల హత్యకు గురయ్యారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది.

ధాన్యం దగ్ధం



కాలిపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: రైతు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన రట్టిణి గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రైతు తనయ పాత్రో ఎకరా పొలంలో సాగుచేసిన వరిని నూర్పు చేసి.. ధాన్యాన్ని కళ్లానికి ఆనుకొని ఉన్న పొలంలో భద్రపరిచారు. అయితే అగ్ని ప్రమాదం చోటుసుకోవడంతో సుమారు 17 బస్తాల ధాన్యం కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ మనీషా ప్రమాద స్థలాన్ని సందర్శించి కాలిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

చదువుకు పట్టం!



విద్యార్థులకు అభ్యసనా సామర్థ్యాలపై తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయులు

- ఏపీఎంలకు విద్యారంగ పథకాల అమలు బాధ్యత
- మండలానికొకరు పర్యవేక్షణ
- ఉపాధ్యాయులకు ఉపశమనం

పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1,763
ప్రాథమికోన్నత	317
ఉన్నత	2,381
మొత్తం	4,461

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పట్టం కడుతోంది. విద్యారంగం అభివృద్ధే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోంది. వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. అయితే వీటి పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించి వారిని కేవలం బోధనకే పరిమితం చేసి సంక్షేమ పథకాల అమలకు ఇతరులను వినియోగించాలని భావించి సరికొత్త నిర్ణయం తీసుకుంది. పథకాల పర్యవేక్షణకు మండల స్థాయిలో ప్రత్యేక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డీఆర్‌డీఏలో సెర్ప్ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లకు (ఏపీఎం) ఈ వ్యవస్థలోని పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలానికి ఒకరు పథకాలను పర్యవేక్షణ చేసేలా బాధ్యతలు అప్పగించింది. మండల విద్యాశాఖ అధికారి సమన్వయంతో విధులను నిర్దేశించింది. జిల్లాలోని 4,461 పాఠశాలల్లో 1,85,519 మంది విద్యార్థులకు, 9,075 మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరనుంది.

రెండు శాఖల సమన్వయంతో..

విద్యారంగంలోని పథకాల అమలులో జిల్లా ఉప, మండల విద్యా శాఖ అధికారులకు ఏపీఎంలు సహకరిస్తారు. నోట్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీతో పాటు స్కాలర్‌షిప్‌లు, ధ్రువీకరణ పత్రాల జారీలో సహకరిస్తారు. దీంతో ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గుతుంది. ఇక నుంచి టీచర్లు అకడమిక్, ఇతర నిర్వాహక వ్యవహారాలను మాత్రమే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న ప్రతి పాఠశాలను ఏపీఎంలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇలా పథకాలు పారదర్శకంగా అందించడంతో పాటు చదువులకు పట్టం కట్టేలా ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

పాఠశాల స్థాయిలో..

ఏపీఎంలు పాఠశాల స్థాయిలో పలు కార్యక్రమాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీటిలో మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల పరిశుభ్రత, పాఠశాల సక్రమ నిర్వహణ కోసం బడ్జెట్ కేటాయింపు, నీతి అయోగ్ సీఎస్ఆర్ ద్వారా మౌలిక వసరుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపు కోసం నూతన జాతీయ విద్యా విధానం ద్వారా పాఠశాలల మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు ఆన్‌లైన్- డిజిటల్ పాఠాలు అందించడం, తరల్, సాల్ట్, లిప్, సిప్, దీక్షా, జోలీ ఫోనిక్స్ వంటివి ఉన్నాయి.

ఏపీఎంల బాధ్యతలు..

- గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపించాలి
- జగనన్న అమ్మఒడి పథకం కోసం అర్హులైన తల్లులను గుర్తించాలి
- పాఠశాలలో విద్య, వైద్య, రక్షణ బాధ్యతల పర్యవేక్షణ
- ఉపాధ్యాయుల జీతాలు, సెలవుల మంజూరు. ట్రెజరీ పనులు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో నిర్వహించే సమీక్షా సమావేశాలకు హాజరు
- జగనన్న గోరు ముద్ద పథకం సక్రమంగా అమలు చేయడం
- మరుగుదొడ్ల నిర్వహణ, నిధి కాలకలాపాల పథకాల పర్యవేక్షణ
- పాఠశాల పరిధిలోని డిజిటల్ పరికరాలు, ఇంటర్నెట్ భద్రత, వాటి పర్యవేక్షణ
- స్వాతంత్ర్య, గణతంత్ర, ఉపాధ్యాయ, బాలల దినోత్సవాల నిర్వహణ

పారదర్శకంగా అమలు



పాఠశాలల్లో ప్రతి సంక్షేమ పథకాన్ని ఏపీఎంలు పర్యవేక్షిస్తారు. స్వయంశక్తి సంఘాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో ఏపీఎంలకు ప్రత్యక్షంగా సంబంధాలు ఉంటాయి. కాబట్టి విద్యార్థుల డ్రాపౌట్స్ నివారణ సాధ్యవుతోంది. విద్యారంగంలో పథకాలు పాదర్శకంగా అర్హులందరికీ సక్రమంగా అందడానికి ఏపీఎం వ్యవస్థ బాగా ఉపయోగపడుతుంది. ఏపీఎంలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడం వల్ల ఉపాధ్యాయులకు, డిప్యూటీ ఈఓలకు, ఎంఈఓలకు పనిభారం తగ్గుతోంది.

– డి.వి. విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ, శ్రీకాకుళం

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌కు రెండు కళ్లు

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మాట్లాడుతున్న రెడ్డి శాంతి

శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ పాలననే ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగనన్న చేదోడు పథకం ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు సహా 3.3 లక్షల మంది లబ్ధిదారులకు సీఎం జగన్ రూ. 330 కోట్లు విడుదల చేసి అండగా నిలబడ్డారన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో చిట్టచివరి నియోజకవర్గంగా పాతపట్నం ఉండేదన్నారు. దీనికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. టీడీపీ హయాంలో వంశధార నిర్వాసితుల కోసం రూ. 400 కోట్లు వెచ్చించినప్పటికీ.. చంద్రబాబు, అచ్చెన్నాయుడు, కలమట వెంకటరమణతో పాటు ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులు వాటాలు వేసుకుని పరిహారమంతా బొక్కేశారన్నారు. జగన్ ప్రభుత్వంలో మాత్రం అదనపు పరిహారం చెల్లించేందుకు రూ. 216 కోట్లు అందించి నేరుగా నిర్వాసితుల ఖాతాల్లోకే పారదర్శకంగా నిధులు జమ చేశారని వివరించారు. ఉద్దానంలో కిడ్నీ బాధితులకు మంచినీరు అందించి శాశ్వతంగా కిడ్నీ వ్యాధి నుంచి దూరం చేసేందుకు రూ. 700 కోట్లు నిధులతో హిరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం వరకు మంచినీటి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన ఘనత జగనన్నదేనన్నారు. ఈ పథకాన్ని అనుసంధానం చేస్తూ పాతపట్నం నియోజకవర్గంలోని మూడు మండలాలకు మంచినీటిని అందించేందుకు రూ.265 కోట్లు మంజూరు చేసి ఆదుకున్నారన్నారు. వర్షాకాలంలో రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటి మట్టం నిల్వ చేసుకునే విధంగా రూ.200 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు చేసి 2.30 లక్షల ఎకరాలకు సాగునీరు స్థిరీకరించడానికి శ్రీకారం చుట్టారన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో రైల్వే ట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణం, ఆమదాలవలస, కొత్తూరు మధ్య పలు చోట్ల వంతెనలు నిర్మించాలని ముఖ్యమంత్రిని కోరినట్టు చెప్పారు. ఉద్దానం నెఫ్రోపతీ అనేది ముఖ్యంగా ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ఉందన్నారు. 2019 వరకు దశాబ్దాలుగా ఏమీ చేయలేదని, సీఎం జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానం ప్రాంతంలో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామాల్లో వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతోందన్నారు. పాతపట్నం నియోజకవర్గానికి రూ. వెయ్యి కోట్లు నిధులు కేటాయించారన్నారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిందన్నారు. మహిళలను జగనన్న ప్రభుత్వం ఆదుకుంటుంటే చూసి ఓర్వలేక చంద్రబాబు అండ్ కో తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాము గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్తున్న సమయంలో వారంతా తమకు స్వాగతం పలికి జగనన్న పథకాలకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అన్నివర్గాల ప్రజల ఆదరణతో రానున్న ఎన్నికల్లో 175కి 175 స్థానాలు సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజాసమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమకు ప్రజాభిమానం కూడా అంతేస్థాయిలో ఉందన్నారు.

పూర్తిస్థాయిలో చిరుధాన్యాల కొనుగోలు



చిరుధాన్యాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తు దృశ్యం

- వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్

గార: చిరుధాన్యాలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్ చెప్పారు. శ్రీకూర్మం పంచాయతీ దువ్వుపేటలో చిరుధాన్యాల సాగుపై సోమవారం సాయంత్రం రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఈ ఏడాదిని గుర్తించారన్నారు. ఇందులో భాగంగా చిరుధాన్యాలు సాగుచేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. చిరుధాన్యాల సాగుకు నీటి వినియోగం పెద్దగా అవసరం ఉండదని, ఎరువులు తక్కువ స్థాయిలో వినియోగించడం జరుగుతోందన్నారు. దీంతో వీటిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయన్నారు. దువ్వుపేట గ్రామంలో రాగులు ఎక్కువ పండించడం ద్వారా జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. ఈ ఏడాది ఎన్ని రాగులు పండినా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముందుగా గ్రామంలో చిరుధాన్యాల సాగువలన కలిగే లాభాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు, ఎంపీపీ గొండు రఘురామ్, వ్యవసాయ శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి, ఏడీ బగ్గు రజిని, డీఆర్‌సీ ఏవోలు సూర్యకుమారి, ఇందుమతి, ప్రియాంక, ఏవో దుంపల పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు అందవరపు బాలకృష్ణమూర్తి, ఊట అప్పలనాయుడు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

కోటబొమ్మాళి: పశువుల అక్రమ రవాణాపై పోలీసులు దృష్టిసారించాలని గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేసి శిక్షించాలని సూచించారు. కోటబొమ్మాళిలో వెటర్నరీ ఏడీ మంద లోకనాథం అధ్యక్షతన మండలంలోని పశువుల సంతల మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ.. హైకోర్టు ఆదేశాల మేరకు సంతల్లో దాణా, తాగునీరు, నీడనిచ్చే చెట్లు, షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. నారాయణవలస సంతలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, జీపీఎస్ వాహనాల్లోనే పశువులను తరలించాలని కోరారు. ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ.. నారాయణవలస సంతలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 40 లక్షలు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడ కె.వి.ఆర్. సత్యన్నారాయణ, పశువైద్యులు ప్రజ్ఞచైతన్య, వెంకటేష్, ఆర్ఐ హరి, వెటర్నరీ సహాయకులు శాంతారావు, భానోజీరావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష ఉండరాదని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ స్పర్శ లెప్రసీపై నిర్వహించే ఆవగాహన కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాను కుష్టు వ్యాధి నుంచి విముక్తి చేయడానికి ఉన్న ఏ అవకాశాన్ని వదులుకోమన్నారు. ఈ వ్యాధిని సులభంగా గుర్తించి చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ప్రారంభ దశలోనే కనుక్కోవాలని సిబ్బందికి సూచించారు.

వ్యాధిగ్రస్తులపట్ల ఎలాంటి వివక్ష చూపమని, ఎవరైనా వివక్ష ప్రదర్శించటాన్ని చూస్తే అంగీకరించమని అధికారులందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనూరాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

లావేరు: గ్యాస్ స్టౌపై వంట చేస్తుండగా సంభవించిన ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతి చెందింది. లావేటిపాలెంలోని ఎస్సీ కాలనీకి చెందిన గంట్యాన అశిరమ్మ (70) ఈ నెల ఎనిమిదో తేదీన గ్యాస్ స్టౌపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చేలరేగి ఆమెను అంటుకున్నాయి.

తీవ్రంగా గాయపడిన అశిరమ్మను కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈమెకు భర్త అప్పయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలియడంతో లావేరు–2 సచివాలయం వీఆర్వో టి.లక్ష్మణరావు, లావేరు పోలీసులు రిమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారు. అశిరమ్మ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేయించారు.

దేశ సమగ్రతకే భారత్ జోడో యాత్ర

- డీసీసీ అధ్యక్షురాలు సత్యవతి



వసంతకుమార్ మృతికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: దేశ సమగ్రత, సమైఖ్యత కోసమే కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతదేశం సమగ్రత, సమైక్యతతో ఉన్న తరుణంలో దేశ రాజకీయాల్లోకి ఆర్ఎస్ఎస్ విధానాలతో వచ్చిన బీజేపీ జాతులు, కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ రాజకీయ కుతంత్రాలు పన్నుతోందని విమర్శించారు.

వట్టికి నివాళులు

మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని సత్యవతి అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నాయకులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు, దేశళ్ల గోవింద మల్లిబాబు, లఖినేన నారాయణరావు, కొత్తకోట సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ ఔదార్యం

- జూనియర్ కళాశాలకు నదుపాయాల కల్పన



మరుగుదొడ్లు ప్రారంభం కార్యక్రమంలో కాంట్రాక్టర్ నారాయణ, కుటుంబ సభ్యులు

ఇచ్ఛాపురం: కాంట్రాక్టర్ గుజ్జు నారాయణ ఔదర్యాన్ని చాటుకున్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని స్టేషన్ రోడ్డులో కొత్తగా నిర్మాణం చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు 20 లక్షల రూపాయలతో వివిధ మౌలిక సదుపాయాలు కల్పించారు. 12 బ్లాక్‌లతో మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. కళాశాల తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం, పరిసరాల్లో గ్రావెల్ ఫిల్లింగ్ చేసి ఆదర్శంగా నిలిచారు. ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం ప్రారంభించారు. 2019 లో రూ. ఒక కోటి నాలుగు లక్షలతో కళాశాల నిర్మాణం జరిగింది. అయితే మరుగుదొడ్లు లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దీంతో కాంట్రాక్టర్ నారాయణ సొంత నిధులు వెచ్చించి తల్లిదండ్రులు గుజ్జు గంగాధర్‌రెడ్డి, సుందరమ్మ జ్ఞాపకార్థం మౌలిక సదుపాయలు కల్పించారు. కాగా నారాయణను కళాశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి, కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.

కమ్మసిగడాం జాతర ప్రారంభం

- మహాలక్ష్మీతల్లి కల్యాణంతో శ్రీకారం



మహాలక్ష్మీతల్లి కల్యాణం జరిపిస్తున్న వెలిచేటి కుటుంబీకులు

రణస్థలం: కమ్మసిగడాంలోని మహాలక్ష్మీతల్లి జాతర మహోత్సవం సోమవారం రాత్రి ప్రారంభమైంది. రాత్రి 9.55 గంటలకు బంటుపల్లికి చెందిన వెలిచేటి కుటుంబీకులు అమ్మవారిని పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చి కల్యాణం జరిపించడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. మహాలక్ష్మీతల్లి కన్నవారైన చీపురుపల్లి మండలం పెదనడిపిల్లి చెందిన ఎరిమెని కుటుంబీకులు తాళిబొట్టు, చీర, పసుపు, కుంకుమ, సారెలు తీసుకొచ్చారు. అలాగే అత్తవారి గ్రామమైన సంచాం నుంచి భర్త బొట్ల గుఱప్పదొర కుటుంబీకులు మేళ తాళాలతో హాజరై సంప్రదాయ బద్ధంగా చుట్టుపక్కల ప్రజలందరూ కలిసి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించగా.. ఈ దృశ్యాన్ని ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు తిలకించి తరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు అంపైర్‌గా మాధవరావు



శ్రీకాకుళం న్యూకాలనీ: ఖేలో ఇండియా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అంపైర్ (టెక్నికల్ అఫీషియల్)గా జిల్లాకు చెందిన స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) కె.మాధవరావు నియామకం అయ్యారు. ఈ మేరకు ఇండియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని భూపాల్ వేదికగా మంగళవారం నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. గతంలో పలు జాతీయ, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా, మేనేజర్‌గా మాధవరావు వ్యవహరించారు. ఈయన శ్రీకాకుళంలోని బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో పీడీగా పనిచేస్తున్నారు. అంపైర్‌గా నియామకం కావడంపై డీఈఓ జి.పగడాలమ్మ, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కె.మధుసూదన్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు.